క్లుప్తంగా

విద్యా నైపుణ్యాలను పెంపొందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి ఉపాధ్యాయులకు సూచించారు.గురువారం ఆమె మండల కేంద్రం సి.బెళగలోని స్పెషల్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అదేవిధంగా పాఠ శాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకా రం పౌష్టికాహారాన్ని అందించాలని, వంట పా త్రలు, పదార్థాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని ఎంఈఓ వంట నిర్వాహకులకు సూచించారు.

నాటుసారా స్వాధీనం



పట్టుబడిన నాటుసారాను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామంలో సిబ్బందితో దాడులు నిర్వహించారు. వడ్డె మద్దిలేటి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు గురువారం తెలిపారు. వడ్డెమద్దిలేటిపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలియజేశారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ ఆలీ బేగ్, సిబ్బంది శంకర్‌నాయక్, విరుపాక్షిరెడ్డి, సువర్ణమ్మ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ పంటలను గురువారం ఏఓ మల్లేష్ పరిశీలించారు. పత్తి పంటలో పచ్చపురుగును గమనించిన ఏఓ సంరక్షణకు లీటరు నీటిలో క్వినాల్ఫాస్ 2 ఎంఎల్ లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అదే విధంగా అధికసాంద్రత (ఒత్తు పంట) పద్ధతిలో పత్తి పంట సాగుచేస్తున్న రైతు గొల్ల హనుమంతుకు పంటకు సంబంధించి 45 రోజులు పిచికారీ చేయాల్సిన మెపీక్వాట్ క్లోరైడ్‌ను ఏఓ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటేష్, వీఏఏ మారెప్ప రైతులు పాల్గొన్నారు.

అనుమతి ఉన్న ఎరువులు, విత్తనాలనే విక్రయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులనే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ దుకాణదారులకు సూచించారు. గురువారం కోడుమూరులోని విత్తన, ఎరువుల దుకాణాలను ఏఓ తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి తప్పని సరిగా రసీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, మందులు అమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం శివరామ ట్రేడర్స్‌లో మూడు విత్తన నమూనాలను సేకరించి నాణ్యత ప్రమాణాల పరీక్షల నిమిత్తం తిరుపతి విత్తన పరీక్షా కేంద్రానికి ఏఓ రవిప్రకాష్ పంపించారు.

స్కూల్ తనిఖీ




రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని పందిపాడు గ్రామంలో ఉన్న సన్‌రైజ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను గురువారం ఎంఈఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించిన ఎంఈఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ లోపాలను సరిచేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి ఎంఈఓ సూచించారు. తదుపరి పాఠశాల పరిశీలనకు వచ్చేసరికి రికార్డులను సక్రమంగా ఉండాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొట్టేళ్లు పెంచి... లాభాలు గడించి!

- ఆదర్శంగా నిలుస్తున్న బస్తిపాడు రైతు
- వ్యవసాయంతోపాటు ప్రత్యామ్నాయ ఆదాయం సృష్టించుకున్న వైనం
- ఏడాదికి వందకుపైగా పొట్టేళ్ల అమ్మకం



స్టాండ్‌లో మేత మేస్తున్న పొట్టేళ్లు (ఫైల్)

కల్లూరు: వ్యవసాయం అంటేనే పాడి–పంటలు. అయితే ప్రస్తుతం ఆ పద్ధతిని ఎక్కువ మంది రైతులు పాటించడం లేదు. దీంతో వ్యవసాయం భారంగా మారింది. ఈ నేపథ్యంలో కల్లూరు మండలంలోని బస్తిపాడు గ్రామానికి చెందిన కె. చిన్నరాముడు పొట్టేళ్ల పెంపకంతో లాభాలు గడిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఓ వైపు తనకున్న ఎనిమిదెకరాలను సాగు చేస్తూనే మూడేళ్లుగా పొట్టేళ్ల పెంపకం సాగిస్తున్నాడు. ప్రత్యామ్నాయ ఆదాయ వనరు సృష్టించుకున్న ఈ రైతు ఆర్థిక సమస్యలను అధిగమించాడు.

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వచ్చిన ఆలోచన...

రైతు చిన్నరాముడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల కిందట ఓ రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురయ్యాడు. నెలల పాటు వ్యవసాయం చేయలేని పరిస్థితి. ఇంటి దగ్గరే ఉండాల్సి రావడంతో ఈ కష్టజీవికి ఏమీ తోచలేదు. దీంతో పొట్టేళ్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించుకున్నాడు. తన ఇంటి పక్కనే ఉన్న ఐదు సెంట్ల ఖాళీ స్థలంలో షెడ్డు నిర్మించుకున్నాడు. మేతతోపాటు నీటికి షెడ్డులో ఎనిమిది స్టాండ్‌లు ఏర్పాటు చేసుకున్నాడు. పొట్టేళ్ల పెంపకం చేపట్టి తనకుతానే జీవనోపాధి సృష్టించుకున్నాడీ రైతు.

నెల్లూరు జిల్లా నుంచి పొట్టేళ్ల కొనుగోలు....

నెలూరు జిల్లా గూడూరు నుంచి 40 నుంచి 45 పొట్టేళ్లను కొనుగోలు చేస్తాడు. నాలుగైదు నెలల మేపాకా విక్రయిస్తుంటాడు. సంవత్సరంలో మూడు సార్లు తెచ్చుకుని పోషించి విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నాడు. ఏటా వందకుపైగానే పొట్టేళ్లను విక్రయిస్తుంటాడు. పోషణ బాగుండడంతో రైతు చిన్నరాముడు పొట్టేళ్లకు మంచి డిమాండ్ ఉంది కూడా. ఖర్చులన్నీ పోను ఆదాయం బాగానే ఉంటుందంటాడీ రైతు తాఫీగా.

మూడు ఎకరాల్లో పశుగ్రాసం సాగు

పొట్టేళ్ల పెంపకానికి రైతు చిన్నరాముడు చాలా కష్టపడుతాడు. మేత కోసం తన షేడుకు దగ్గరలోనే ఏకంగా మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని హెడ్జ్‌లూసర్న్, సూపర్ నెపియర్, కోఎఫ్ఎస్–29, స్టైలో హెమటా అనే నాలుగు రకాల పశుగ్రాసం సాగు చేశాడు. పొట్టేళ్లు తెచ్చుకున్న వెంటనే పశువైద్యుల సూచన మేరకు వ్యాధి నివారణ టీకాలను వేస్తాడు. ఉదయం, సాయంత్రం రెండు గంటలు తను సాగు చేసిన నాలుగు రకాల గడ్డిలో మేపుతాడు. మధ్యాహ్నం వేరుశనగ, మినప, శనగ పొట్టును స్టాండ్‌లోవేసి దగ్గరుండి తినిపిస్తాడు. రాత్రి పొట్టేళ్లకు మొక్కజొన్న, జొన్న, సజ్జ, బియ్యం గింజలను ఆప్యాయంగా అందిస్తాడు.

ఓ సారి నష్టపోయినా....

పొట్టేళ్ల పెంపకంలో ఓ సారి పూర్తిగా నష్టపోయినా వెనుకడుగు వేయలేదు రైతు చిన్నరాముడు. ఒక రోజు రాత్రి పొట్టేళ్లపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. దీంతో ఎనిమిది పొట్టేళ్లు మృతి చెందాయి. చాలా మంది వీటి పెంపకం ఆపుతాడని భావించారు. నష్టం చవిచూసినా వెనుకడుగు వేయకుండా పొట్టేళ్ల పెంపకాన్ని కొనసాగించాడు. వ్యవసాయంతో పాటు పొట్టేళ్ల వ్యాపారంలోనూ లాభాలు గడిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు రైతు చిన్నరాముడు.

ప్రోత్సహిస్తే పొట్టేళ్ల సంఖ్య పెంచుతా



కష్టమే అయినా పొట్టేళ్ల పెంపకం లాభదాయకం. పొట్టేలను ఇంట్లో పిల్లలాగానే పెంచాల్సి ఉంటుంది. వాటి అవసరాన్ని మనమే గుర్తించాల్సి ఉంటుంది. వాటి బాధను అర్థం చేసుకోవాలి కూడా. అప్పుడే వాటిని ఆరోగ్యంగా పెంచగలం. నమ్మకంతో పెంచితే మంచిలాభాలు వస్తాయి. నా భార్య సహకారంతో పొట్టేళ్లను ఆరోగ్యంగా పెంచగలుగుతున్నా. ప్రభుత్వం, పశుసంవర్ధ శాఖ, బ్యాంక్ అధికారులు ప్రోత్సహిస్తే పొట్టేళ్ల సంఖ్యను ఎంతైనా పెంచేందుకు సిద్ధంగా ఉన్నా.

– చిన్నరాముడు, రైతు

తాగునీరు కలుషితం కానివ్వొద్దు

పాణ్యం: తాగునీరు ఎక్కడ కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ మధుశేఖర్ సూచించారు. గురువారం ఆయన వివిధ గ్రామాల్లో పర్యటించి పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. నిర్ణయించిన తేదీల్లో ఓహెచ్ఆర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. క్రమం తప్పకుండా శుభ్రం చేసిన తేదీలను పక్కాగా రాయాలన్నారు. అలాగే పైపులైన్ లీకేజీలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైన నీరు కలుషితం అయితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు నీటి కలుషితంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆమె గురువారం 41వ వార్డులో సీఎండీఎఫ్ నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వార్డులో సీసీ డ్రైనేజీ, శిల్పా అపార్ట్‌మెంట్ నుంచి డిస్పోజల్ డ్రైయిన్ నిర్మాణ పనులు, కౌసల్య అపార్ట్‌మెంట్ నుంచి విష్ణు టౌన్‌షిప్ వరకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, పురుషోత్తంరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేస్తాం



బూజునూరులో పొలాలను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి

- ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి

గడివేముల: పవర్‌గ్రిడ్ సంస్థ స్తంభాల ఏర్పాటు నేపథ్యంలో పొలాల్లో స్థలం నష్టపోతున్న రైతులందరికీ న్యాయం చేస్తామని ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి హామీ ఇచ్చారు. మండల పరిధిలోని చిందుకూరు, బూజునూరు గ్రామాలలో స్తంభాల ఏర్పాటు జరుగుతున్న ప్రాంతాలను గురువారం తహసీల్దార్ జమానుల్లాఖాన్‌తో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. కొలిమిగుండ్ల నుంచి ఓర్వకల్లు వరకు హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గడివేముల మండలంలోని వివిధ గ్రామాల్లో 60 టవర్లు ఏర్పాటు చేయనున్నారు. అయితే రైతుల పొలాలలో స్తంభాలు ఏర్పాటుకు సంబంధించి నష్ట పరిహారం అందించకపోవడంతో బాధిత రైతులు ఆర్‌డీఓకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్డీఓ పవర్‌గ్రిడ్ సంస్థ ప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులతో కలిసి ఆయా ప్రాంతాల వివరాలపై ఆరా తీశారు. నష్టపోతున్న రైతుల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌డీఓ మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు నష్ట పరిహారం అందించాలని సంస్థ యాజమాన్యాన్ని సూచించారు. భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి నష్ట పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆర్డీఓ తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్, మండల సర్వేయర్ శివప్రసాద్, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



వీఏఏకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



ఉలిందకొండలో గ్రామ సచివాలయ సిబ్బందికి వినతిపత్రమిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు



ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఓర్వకల్లు: ప్రస్తుత కూటమీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను తక్షణమే అందించాలని ఏపీ రైతు సంఘం, వ్యకాస నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని నన్నూరు సచివాలయం ఎదుట నాయకులు నిరసన తెలిపారు. రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర గడిచినా టీడీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. అనంతరం వీఏఏ అనితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, మాసూంబాషా, దస్తగిరి, బుజ్జన్న, రైతులు శివరాముడు, దేవరాజు, రమేష, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: టీడీపీ ప్రభుత్వం రైతులకు వెంటనే పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందించాలని ఏపీ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉలిందకొండ గ్రామ సచివాలయం ఎదుట రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి మధు అధ్యక్షతన నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులందరికి కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి, రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, బాషా, పూలరంగడు, మారన్న తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: ఖరీఫ్ సాగు ప్రారంభమై నెలన్నర అయ్యిందని, టీడీపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ. 20వేల అందించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యజమాని అగ్రిమెంట్‌తో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు అందించాలన్నారు. 2023లో కరువు, తుఫాన్ వలన నష్టోయిన రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖాసీం, ప్రసాద్, నాగ సురేష్, ప్రసాద్‌రెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే



కుష్టు వ్యాధి నివారణ వాల్‌పోస్టర్లను విడుదల వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న సూచించారు. గురువారం కోడుమూరులో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధి నిర్ధారణ కోసం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, చర్మం పొడిగా ఉండడం, కనురెప్పలు వెంట్రుకలు రాలిపోవడం, చేతులు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి తదితర లక్షణాలుంటే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మల్టీ డ్రగ్ తెరపి మందులు వాడడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఏఎన్ఎం నాగమణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తిరుమలమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పలుకుదొడ్డి సర్పంచ్ మృతి



లక్ష్మీదేవమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ సతీష్, నాయకులు



దేవదాసు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ సతీష్



సర్పంచ్ లక్ష్మీదేవమ్మ (ఫైల్)

సి.బెళగల్: మండలంలోని పలుకుదొడ్డి గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ (70) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, నాయకులు గురువారం పలుకుదొడ్డి గ్రామానికి చేరుకుని సర్పంచ్‌కు నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్‌కు కుమారుడు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి, కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శులు ముందరింటి వెంకటేష్, రామకృష్ణ, నాయకులు శంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు దస్తగిరి, పాండురంగన్న, హనుమంతు పాల్గొన్నారు.

- ఇనగండ్ల గ్రామ సర్పంచ్ ఇమ్మానియేల్ చినాన్న సంధ్యపోగు దేవదాసు (74) అనారోగ్యంతో మృతి చెందారు. దేవదాసు మృతదేహంపై డాక్టర్ సతీష్ నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్పంచ్ ఇమ్మానియేల్, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మున్సిపల్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ నగర పర్యటనలో ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. ఆయన గురువారం నగరపాలకలోని తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రావు నగర్‌లో మరుగుదొడ్లు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ఆనంద్ థియేటర్ ఎదుట డంప్ తొలగించి గ్రీనరీకి ఏర్పాటు చేయాలని, కేసీ కెనాల్‌కు రక్షణ వలయం ఏర్పాటు చేయాలన్నారు. గడియారం ఆసుపత్రిలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, సిబ్బంది నియామకంపై ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగర పాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ షాకీర్‌హుస్సేన్, డీసీపీ సంధ్యారాణి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఏసీపీ రంగస్వామి పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వ లేకుండా చూడండి



భూపనపాడు గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సులోచన

పాణ్యం: వర్షకాలంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఈఓఆర్డీ సులోచన సూచించారు. గురువారం భూపనాపడు గ్రామంలో ఆమె పర్యటించారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ డ్రైనేజీ కాల్వలో ఆయిల్‌బాల్స్ వేయాలని సిబ్బందికి సూచించారు. దొమలు వృద్ధి చెందకుండా నీలి మందుల పిచికారీ చేయించాలన్నారు. అలాగే తడి,పొడి చెత్తలను వేరుగా చేసి వర్మీ యూనిట్‌కు తరలించాలన్నారు. రోడ్డుపై చెత్త వేయకుండా ఆయా గ్రామాల కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు తాగునీరును పరిశీలించాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రమణ

కల్లూరు: ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని, రైతులు ముందుకు రావాలని మండల ప్రత్యేక అధికారి రమణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పండ్లతోటల సాగులో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఏపీఓలకు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఉపాధి ఏపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేల బోధన చేయాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్ఎంఓ కల్పన శైలి



భవిత కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కల్పన శైలి

–ఎస్ఎఎంఓ కల్పన శైల

కల్లూరు: ప్రత్యేక అవసరాల పిల్లలకు అర్థమయ్యేల బోధన చేయాలని రాష్ట్ర ట్రైనింగ్ అండ్ ప్రోగ్రాం ఆఫీసర్ (ఎస్ఎఎంఓ) కల్పన శైలి సూచించారు. గురువారం ఆమె కల్లూరు అర్బన్ పరిధిలోని ప్రత్యేక అవసరాల పిల్లల శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరఫీపై ఆరా తీశారు. విద్యార్థులకు సేవలు ఎలా అందుతున్నాయని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం గోవర్ధన్ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ (టిఎఆర్ఎస్) కార్యక్రమం అమలును పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన స్థాయిని పరీక్షించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్ సురేష్ రాజు, టీఎఆర్ఎల్ అబ్దుల్, ఐఈఆర్‌పీలు, సీఆర్ ఎంటీలు పాల్గొన్నారు.



ఆశుర నిర్వహిస్తున్న భక్తులు



కందికాయపల్లెలో నిమజ్జనానికి పీర్లను తరలిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో ఆశుర

సి.బెళగల్: మొహర్రం ముగింపు సందర్భంగా గురువారం సి.బెళగల్‌లో భక్తులు, మత పెద్దలు భక్తిశ్రద్ధలతో ఆశుర నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని వీధులలో భక్తులు విశాద గీతాలు ఆలపిస్తూ తిరిగారు. గ్రామంలో మొహర్రం వేడుకలు ముగియడంతో భక్తులు పీర్ల చావిడీల వద్ద ముగింపు ప్రార్థనలు జరిపారు.

ఏటికి తరలిన పీర్లు

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో మొహర్రం వేడుకలు గురువారం ముగిశాయి. సాయంత్రం పీర్లను నిమజ్జనానికి తరలించారు. చిన్న కాశీంస్వామి, ఇతర పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. అనంతరం సాయంత్రం గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పీర్లదేవుళ్లకు చెక్కర చదివింపులు చేశారు. అనంతరం గ్రామం బయటకు నిమజ్జనానికి తరలించారు.

ఆదమరిస్తే...అంతే !



గడివేములలోని పాతబస్టాండ్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

గడివేముల: మండల కేంద్రం గడివేములలోని పాత బస్టాండ్ సర్కిల్ వెలుగోడు రస్తాలో ప్రధాన రహదారిపై రోడ్డు దెబ్బతిని గుంతగా మారింది. ఆదమరిస్తే అంతే సంగతులు అన్న చందనంగా ఉంది రోడ్డు. పాత బస్టాండు నుంచి నంద్యాల, నందికోట్కూరు, వెలుగోడుకు నిత్యం వందలాది వాహనచోదకులు, ప్రయాణికులు తిరుగుతుంటారు. ఇప్పటికే చాలా మంది గుంతలో పడి గాయాలకు గురయ్యారు. రాత్రివేళల్లో ఎక్కువగా ప్రమాదాలు జరగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.